## బీఆర్ఎస్‌లో చేరిన గూడెప్పాడ్ ఎంపీటీసీ

### ఆహ్వానించిన ఎమ్మెల్యే చల్లా



బీరం రజినీకర్‌రెడ్డికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు, నవంబర్ 17 : మండలంలోని గూడెప్పాడ్ కాంగ్రెస్ ఎంపీటీసీ బీరం రజినీకర్‌రెడ్డి శుక్రవారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కాంతాల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండల నాయకుడు రడం భరత్

## 'బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి'

గీసుగొండ, నవంబర్ 17 : బీఆర్ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని పార్టీ మండల నాయకుడు రడం భరత్ అన్నారు. చంద్రయ్యపల్లి గ్రామంలో పది ముస్లిం కుటుంబాలు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. వారికి స్థానిక నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రడం భరత్ మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసి పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ధర్మారెడ్డి గెలిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. పార్టీలో చేరిన వారిలో అల్లావుద్దీన్, అన్వర్, అక్బర్, మైనోద్దీన్, రాజ్‌మహ్మద్ తోపాటు మరో 20 మంది ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కట్టయ్య, ఆదిరెడ్డి, ఓదెలు, మహేందర్, ప్రవీణ్, హరికృష్ణ పాల్గొన్నారు.

## 'ఎమ్మెల్యే చల్లాను ఓర్వలేకే ఆరోపణలు'



వరికోల్‌లో మాట్లాడుతున్న మహిళలు

నడికూడ, నవంబర్ 17 : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఆయనపై ఆరోపణలు చేస్తున్నాయని వరికోల్ గ్రామ మహిళలు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అనే స్వచ్ఛంద సంస్థ నెల రోజుల పాటు భోజన వసతి కల్పిస్తూ, కుట్టు శిక్షణ తరగతులను నిర్వహించిందని తెలిపారు. దీనికి బీఆర్ఎస్ పార్టీ సంబంధం లేదని స్పష్టం చేశారు. శిక్షణానంతరం ఇచ్చిన పాత మిషన్లను తరలిస్తుండగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని, ఇందులో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రమేయం ఉందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా మాత్రమే శిక్షణ అందించారని, ఇందులో చల్లా ధర్మారెడ్డికి సంబంధం లేదని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల దుష్ప్రచారాలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## 'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

గీసుగొండ, నవంబర్ 17 : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని వరంగల్ డీఈవో వాసంతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యా యులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక క్లాసులను నిర్వహించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ సారయ్య, ఎంఎన్‌వో రవీందర్, హెచ్‌ం పట్టాభి పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి

గీసుగొండ, నవంబర్ 17 : ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నాగుల చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగేంద్రస్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. నాగేంద్రస్వామి మాలధారణ చేసిన వారు పాలకావాడి మోసి మాలవిరమించారు. కార్యక్రమంలో అర్చకులు సుదార్శనాచార్యులు, సర్పంచ్ నాగదేవత, ఎంపీటీసీ వీరారావు పాల్గొన్నారు.

# పరకాలకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



పరకాల : కేసీఆర్ సభకు తరలివెళ్తున్న 15వ వార్డు కౌన్సిలర్ రజిని, నాయకులు



దామెర : మండల కేంద్రం నుంచి సభకు తరలివెళుతున్న బీఆర్ఎస్ నాయకులు

గీసుగొండ, నవంబర్ 17 : పరకాలలో శుక్రవారం జరిగిన ప్రజాఆశీర్వాద సభకు గీసుగొండ మండలంతో పాటు 15,16వ డివిజన్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పోలీసు ధర్మారావు మాట్లాడుతూ 100 డీసీఎంలలో సుమారు 10 వేల మందిని సభకు తరలించినట్లు తెలిపారు. పరకాలలో ధర్మారెడ్డి గెలుపు ఖాయమైందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అంకతి నాగేశ్వర్‌రావు, బోడకుంట్ల ప్రకాశ్, అమ్మి, వీరాటి కవిత, వాంకుడోత్ రజిత, జైపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగదేవత, రమ, దౌడు బాబు, డోలి రాధా చిన్ని, రజిత, అనిల్, ఎంపీటీసీలు వీరరావు, భిక్షపతి, రజిత, పార్టీ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు సుంకరి శివకుమార్, కిశోర్‌కుమార్, లవ్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, రమేశ్, రాజు పాల్గొన్నారు. అలాగే, పరకాల నుంచి బీఆర్ఎస్ నాయకులు కూడా సభకు వెళ్లారు.

**దామెర మండలం నుంచి..**

దామెర : మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్లారు. దామెరలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని రాజు యాదవ్, వేల్పుల ప్రసాద్ వెళ్లారు. అలాగే, కోగిల్వాయి, ల్యాదెళ్ల, ఊరుగొండ, ఓగ్లాపురం, దుర్గంపేట, సీతారాంపురం, వెంకటాపురం సింగరాజుపల్లి, పులుకుర్తి, పసరగొండ గ్రామాల నుంచి ఎంపీపీ కాగితాల శంకర్, జడ్పీటీసీ కల్పన, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, పార్టీ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, యూత్ మండల అధ్యక్షుడు మెంతుల రాజు, సర్పంచ్‌లు గట్ల విష్ణువర్ధన్ రెడ్డి, గోగుల సత్యనారాయణరెడ్డి, కునాటి సునీల్‌రెడ్డి, గోవిందు అశోక్, కేతిపల్లి సరోజన, మాజీ ఎంపీటీసీ కన్నెబోయిన రమేశ్ వెళ్లారు.

**సంగెం మండలం నుంచి..**

సంగెం : కేసీఆర్ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు.చల్లా ధర్మారెడ్డి గెలుపు కోరుతూ బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు జై బీఆర్ఎస్, జైజై చల్లా అంటూ నినాదాలు చేస్తూ సభకు వెళ్లారు. సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు తదితరులు ఉన్నారు.

## పరకాలకు రెండు బ్యాలెట్ యూనిట్లు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తాపట్నాయక్**



వివరాలు అడుగుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, నవంబర్ 17: అసెంబ్లీ ఎన్నికలలో పరకాల నియోజకవర్గానికి రెండు బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తాపట్నాయక్ తెలిపారు. శుక్రవారం ఎనుమాముల మార్కెట్ వద్ద అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి ఎన్నికల అదనపు బ్యాలెట్ యూనిట్ల కేటాయింపును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ పరకాల నియోజక వర్గంలో 28 మంది, పశ్చిమ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ఒక్క బ్యాలెట్ యూనిట్ ద్వారా 15 మంది అభ్యర్థులు మాత్రమే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. పరకాలలో 28 మంది పోటీలో ఉన్నందున ఒక పోలింగ్ స్టేషన్‌కు రెండు బ్యాలెట్ యూనిట్ల చొప్పున మరో 298 బ్యాలెట్ యూనిట్లను కేటాయించినట్లు తెలిపారు.

**20 నుంచి హోం ఓటింగ్**

జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజక వర్గాల పరిధిలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజులు హోం ఓటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. సాయంత్రం కలెక్టరేట్‌లో సెక్టోరియల్, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు హోమ్ ఓటింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు హోమ్ ఓటింగ్ విధానం ద్వారా ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బందితో పాటు బీఎల్‌వోలు, పోటీ చేసే అభ్యర్థుల ఏజెంట్లు ఉంటారని, ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 11 బృందాలు, పరకాల పరిధిలో 6 బృందాలను కేటాయించినట్లు చెప్పారు. ఓటు తీసుకునే క్రమంలో అప్రమత్తంగా, పూర్తి పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ హోమ్ ఓటింగ్ గురించి అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎల్ రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారుల పరిశీలన

ఆత్మకూరు/నడికూడ, నవంబర్ 17 : ఆత్మకూరు మండలంలోని గూడెప్పాడ్, ఆత్మకూరు, కటాక్షపురం, నీరుకుళ్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ హెచ్ఎన్ గోపాల్‌కృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు వివరాలను తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కటాక్షపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. అనంతరం గోపాల కృష్ణ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రవిరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, నడికూడ మండలంలోని 33, 34, 35, ధర్మారం 68 పోలింగ్ స్టేషన్లతోపాటు చెక్‌పోస్ట్‌ను గోపాలకృష్ణ తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ పకడ్బందీగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుండాల నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.



ఆత్మకూరు : కటాక్షపురం చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ గోపాలకృష్ణ

## ప్రతి పైసాకూ లెక్క

- నామినేషన్ వేసిన రోజు నుంచే గణన
- రూ.40 లక్షల ఖర్చు మించితే అనర్హులే
- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్ పంజాబ్రావ్ గవాండే




మాట్లాడుతున్న రాహుల్ పంజాబ్రావ్ గవాండే

హనుమకొండ, నవంబర్ 17 : అభ్యర్థి నామినేషన్ వేసిన రోజు నుంచి కౌంటింగ్ వరకూ ప్రతి ఖర్చు ఎన్నికల వ్యయం కింద జమ అవుతుందని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్ పంజాబ్రావ్ గవాండే అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ప్రతినిధులకు ఎన్నికల వ్యయం జమపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌బ్రావ్ గవాండే మాట్లాడుతూ ఖర్చు చేస్తున్న వ్యయాన్ని అభ్యర్థులు తప్పకుండా చూపించాలన్నారు. ఒక అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.40 లక్షలకు మించితే అనర్హులుగా ప్రకటిస్తామన్నారు. కరపత్రాలు, పోస్టర్లు అనుమతి తీసుకున్న తర్వాతే ప్రచారానికి వినియోగించాలన్నారు. వాటిపై ముద్రించిన వారి పేరు, నెంబర్, ఇతర వివరాలు ఉండాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల్లో డబ్బులు, గిఫ్టులు పంచితే చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థులు రోజు రూ.10 వేల కంటే ఎక్కువ నగదును ఖర్చు చేయొద్దన్నారు. అభ్యర్థులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాలు, వినియోగించే పూలదండలు, కార్పెట్, వాటర్, టీ, ఇలా అన్ని ఎన్నికల వ్యయం కింద జమవుతాయని వివరించారు. అభ్యర్థులు తమ బ్యాంకు అకౌంట్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. పత్రికలు, చానళ్లలో అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలను ఎంసీఎంసీ గుర్తించి నోటీసులు అందజేస్తే వాటికి అభ్యర్థులు సమాధానం చెప్పాలన్నారు. ఫిర్యాదులుంటే సీ–విజిల్ యాప్ ద్వారా చేయవచ్చన్నారు. ఈ నెల 18, 22, 26 తేదీల్లో అభ్యర్థుల వ్యయ పరిశీలన ఉంటుందన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ నోడల్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏఈవోలు, పశ్చిమ, పరకాల నియోజకవర్గ అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.